# రెండువేల టెక్ సైన్యం మాది!

**సాంకేతిక రంగంలోకి రావాలనుకునేవారికి.. ఇప్పటికే వచ్చి.. తమదైన గుర్తింపు తెచ్చుకోవాలనుకునేవారికి.. ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తుంది విమెన్ టెక్‌మేకర్స్ బృందం. ఈ బృందం ఏర్పాటులో, ఆ కార్యక్రమాల నిర్వహణలో వినిపించే మొదటి పేరు సింధూరా మోక్షగుండం. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ చదివిన ఆమె అసలు దీన్నెందుకు ప్రారంభించిందంటే..**





సాంకేతిక రంగంలో మహిళల భాగస్వామ్యం పెంచాలనే ఉద్దేశంతోనే విమెన్ టెక్‌మేకర్స్ గ్రూప్‌ని అందుబాటులోకి తెచ్చా. ప్రస్తుతం ఈగ్రూప్‌లో మహిళల సంఖ్య 2500 పైగా ఉంది తెలుసా! అదెలా ప్రారంభమయ్యిందంటే..

మా స్వస్థలం కర్నూలు. నాన్న సైనికోద్యోగి కావడంతో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పెరిగా. ప్రస్తుతం హైదరాబాద్‌లో స్థిర పడ్డాం. చిన్నతనం నుంచీ.. స్కూలు, కాలేజీలో అన్నింట్లో ముందుండేదాన్ని. నేను విజ్ఞాన భారతీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచీ కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్‌ని డిస్టింక్షన్‌లో పూర్తిచేశా. ఇంజినీరింగ్ చేస్తున్నప్పుడు ఐఈఈఈ విభాగం విమెన్ ఇన్ ఇంజినీరింగ్ అనే సెల్‌ని ప్రారంభించింది. అందులో కీలక సభ్యురాలిగా ఉండేదాన్ని. దాని నిర్వహణలో భాగంగా ఓ సారి మా కాలేజీకి దగ్గర్లో ఉన్న ఓ ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి.. ఇంజినీరింగ్, కంప్యూటర్ల గురించి చెప్పడం మొదలుపెట్టాం. ఆ సమయంలో రోబో సినిమా వచ్చింది.. దాన్ని మా వర్క్‌షాప్‌లో భాగంగా ప్రస్తావించాం. ఇంతలో ఓ విద్యార్థి లేచి.. "డబ్బాలా ఉంటుంది.. అందులో అక్షరాలు వస్తాయి. ఏంటది" అని అడిగాడు. ఆశ్చర్యం అనిపించింది. టీచర్లను అడిగితే వాళ్లకు కంప్యూటరుకి సంబంధించి పుస్తక పరిజ్ఞానమే తప్ప దాన్ని ఎలా ఉపయోగించాలో అవగాహన లేదన్నారు. అది విన్నాక మా కాలేజీ ప్రిన్సిపాల్‌తో మాట్లాడి.. మా ల్యాబ్‌ని ఆ విద్యార్థులు వాడుకునే ఏర్పాటుచేశా. మా కాలేజీ కూడా సహృదయంతో ఆ పిల్లలు వచ్చేందుకు ప్రయాణ సౌకర్యం కల్పించింది. ఆ శిక్షణా కార్యక్రమం ఇప్పటికీ కొనసాగుతోంది. ఇంజినీరింగ్ నాలుగో ఏడాదిలో ఉన్నప్పుడు మేం ఓ ప్రాజెక్టు చేయాలి.. నేను వెబ్‌సైట్ డెవలప్‌మెంట్ గురించిన ఆలోచన చెప్పా. అది మాకు బెస్ట్ ప్రాజెక్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డును తెచ్చిపెట్టింది. అలా ఇంజినీరింగ్ అయిపోయింది.

**ఎనిమిది మందే.. హాజరయ్యారు..** ఆ తర్వాత...నా స్నేహితుడొకరు గూగుల్ ప్రారంభించిన టెక్నాలజీ యూజర్ గ్రూప్ బాధ్యతను తీసుకుంటూ సాయం అడిగాడు. సాంకేతిక అభివృద్ధి విభాగంలో పనిచేసే వారికోసం ప్రారంభించిన సెల్ అది. దాని నిర్వహణలో భాగంగా ఓసారి డెవలపర్స్ ఫెస్ట్‌ని నిర్వహించాం. అరవైమంది రిజిస్టర్ చేసుకుంటే.. ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. అలాంటి మరికొన్ని అనుభవాలు ఎదురయ్యాక ..అసలు సాంకేతిక రంగంలోకి అడుగుపెట్టే మహిళలు ఎంత మంది ఉంటారో తెలుసుకుని.. వాళ్ల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేకంగా ఏం చేయాలేనా అని అనిపించింది. దాంతో "గీగ్ గాళ్స్" అనే గ్రూప్‌ని 2013లో అందుబాటులోకి తెచ్చా. మహిళల కోసం ఓ కార్యక్రమం చేయలనకున్నా. అంతకన్నాముందు కొంత మంది మహిళలతో మాట్లాడా. సాంకేతిక రంగంలో వాళ్లకు ఎదురయ్యే సమస్యలేంటీ.. విధులనూ, ఇంటినీ సమన్వయం చేసుకోవడంలో ఇబ్బందులూ, ప్రయాణాలపరంగా ఎదురయ్యే ఇబ్బందులూ.. ఇలాంటివెన్నో చెప్పారు. అవన్నీ విన్నాక వర్క్‌షాప్‌ని ఏర్పాటుచేశా. అప్పుడూ అంతే. వందమంది ఉత్సాహంగా రిజిస్టర్ చేసుకున్నారు. చివరకు ఎనిమిది మంది మాత్రమే వచ్చారు. తరవాత అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి ఎనిమిదిన ఆన్‌లైన్‌లో ఓ పోటీని పెట్టా. కేవలం పదిహేను నిమిషాల్లో సమాధానాలు చెప్పగలిగేలా జనరల్ నాలెడ్జి, సాంకేతికతకు సంబంధించిన ప్రశ్నలు వేశాం. సరైన సమాధానాలు చెప్పినవారికి బహుమతులూ ఇచ్చాం. వందకు పైగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలా మహిళలపై ఉన్న ఆన్‌లైన్ ప్రభావం తెలిసింది. ఈ మార్పు చూశాక సాంకేతికత రంగంలో రాణించిన మహిళలూ, శాస్త్రవేత్తలు, సాంకేతికత ఆధారంగా ఉపాధిపొందినవారూ.. ఇలా రకరకాల మహిళలతో మరో ఓ కార్యక్రమం ఏర్పాటుచేశా. ఈసారి మహిళలు ఎనభైమంది వచ్చారు. వారిలో ఉద్యోగినులే కాదు, గృహిణులూ, వంటలు చేస్తూ ఆదాయం పొందేవారూ, చిన్నచిన్న వ్యాపారాలు చేసేవారూ ఉన్నారు. వారందరికీ సాంకేతికతను ఆధారంగా చేసుకుని ఎలా రాణించాలో తెలియజేశాం. గూగుల్‌లో వెబ్‌సైట్‌ని ఉచితంగా ఎలా రూపొందించుకోవచ్చో వివరించాం. అది నచ్చిన ఎంతోమంది మా సాయంతో వెబ్‌సైట్లను ఏర్పాటుచేసుకుని తమ ఆలోచనల్నీ, ఉపాధినీ ఆన్‌లైన్ మార్కెటింగ్ చేసుకోవడం మొదలుపెట్టారు. ఇక, కాలేజీ విద్యార్థుల్లోనూ చైతన్యం తెచ్చేందుకు జీసాక్ (గూగుల్ సమ్మర్ కోడ్) అనే కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. నేనూ, మా బృంద సభ్యులు కాలేజీలకు వెళ్లి.. సాంకేతిక పరిజ్ఞానం విషయంలో ఎలాంటి ప్రయోగాలు చేయొచ్చు.. మెంటార్ల ఎంపిక.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవచ్చు.. అంటూ ఎందరో విద్యార్థులకు సలహాలు ఇచ్చాం. తరవాత ఐఐఐటీ హైదరాబాద్‌లో ఓఎస్‌డీపీ (ఓపెన్ సోర్స్ డెవలపర్స్ గ్రూప్) వారితో కలిసి మేం 24 గంటల హ్యాకథాన్ ఏర్పాటుచేశాం. ఇరవై రెండు టీంలు పాల్గొన్నాయి. అందులో మొత్తం అమ్మాయిల టీం చేసిన ప్రాజెక్టుకు మొదటి బహుమతి వచ్చింది.

**టెక్‌మేకర్లుగా మారాం..** మేం ఈ కార్యక్రమాలన్నీ గూగుల్ సంస్థ ప్రారంభించిన గూగుల్ డెవలపర్స్ గ్రూప్‌తోనే కలిపి చేస్తున్నాం. ఆ బృందం హైడ్రాయిడ్ అనే విభాగాన్ని నిర్వహిస్తుంటే.. గీగ్ గాళ్స్ పేరును విమెన్ టెక్‌మేకర్స్‌గా మార్చాం. సాంకేతిక రంగంలోకి రావాలనుకునేవారికే కాదు, వచ్చేవారికీ రకరకాల వర్క్‌షాప్‌లు నిర్వహిస్తాం. అందులో వెబ్‌సైట్ ఏర్పాటు, యాప్‌ని ఎలా రూపొందించాలి.. కోడింగ్, హెచ్‌ఎంటీఎల్.. ఇలాంటివెన్నో ఉంటాయి. వీటన్నింటిపై ఓ పట్టువచ్చేవరకూ విడతలవారీగా వర్క్‌షాప్‌లు నిర్వహిస్తాం. ఒక్కోదానికే రెండుమూడు నెలల సమయం పడుతుంది. ఈ వర్క్‌షాప్‌లన్నీ ఉచితంగానే చేస్తున్నాం. ఈ విషయంలో నా స్నేహితురాలు ప్రత్యూష కూడా ఎంతో సాయం చేస్తుంది. ప్రయోగాలు చేసుకునే మహిళలకు సాంకేతిక పరమైన పరిష్కారాలూ సూచిస్తాం. అయితే ఇవన్నీ నిర్వహించడం మాటల్లో చెప్పినంత సులువు కాదు. మొదట మహిళలు అసలు వచ్చేవారు కాదు. ఇప్పుడు పరిస్థితి మారింది. మాకు గూగుల్ కూడా సాయం చేస్తుంది కాబట్టి.. ఆర్థికపరమైన ఇబ్బందులనూ, మరికొన్ని సమస్యలనూ సులువుగా ఎదుర్కోగలిగాం. త్వరలో స్కూలు పిల్లల్లోనూ సాంతికతపై అవగాహన పెంచేందుకు కొన్ని కార్యక్రమాలు చేసే ఆలోచనలో ఉన్నా. రెండేళ్లక్రితం గూగుల్ సంస్థ తమ డెవలపర్స్ గ్రూప్ ఇన్నోవేషన్ ఓపెన్ అనే కార్యక్రమం శాన్‌ఫ్రాన్సిస్కోలో నిర్వహించింది. దానికి దేశవ్యాప్తంగా టాప్ డెవలపర్స్ ఎంపికయితే.. అందులో నేనూ ఉన్నా. అలాగే శ్రీలంకలో జరిగిన ఇలాంటి మరో కార్యక్రమంలోనూ పాల్గొన్నా.

– హెచ్. శ్రీలక్ష్మి